కల్కి- 2 విడుదల అప్పుడేనా?

ఓ ఐదేళ్లపాటు మరో సినిమాను అంగీకరించలేనంత బిజీగా ఉన్నారు ప్రభాస్. ప్రస్తుతం ఆయన డైరీ ఫుల్ అయిపోయింది. అందుకే గ్యాప్ దొరికితే షూటింగ్‌లు చేసేస్తున్నారు. కాసేపు 'ది రాజాసాబ్'.. ఇంకాసేపు 'ఫౌజీ'.. ఈ లిస్ట్‌లో త్వరలోనే 'స్పిరిట్' చేరనుంది. దీనికైతే సందీప్‌రెడ్డి వంగా ఏకంగా ఏడాదిపాటు బల్క్ డేట్లు అడిగినట్లు తెలుస్తున్నది. అంటే.. రాజాసాబ్, ఫౌజీ రెండింటినీ కంప్లీట్ చేసి కానీ 'స్పిరిట్' వైపు వెళ్లలేరు ప్రభాస్. సరే.. ఇంతకీ 'కల్కి 2' సంగతేంటి? ఆల్రెడీ ఫస్ట్ పార్ట్ 12వందలకోట్ల సంచలన విజయాన్ని నమోదు చేసింది. ఇప్పటివరకూ ఇండియాలో రూపొందిన ఫ్రాంచైజీల్లో ఫస్ట్ పార్ట్‌కే 12కోట్లు రావడం కేవలం 'కల్కి 2898ఏడీ' విషయంలోనే జరిగింది. దాంతో సెకండ్ పార్ట్ కోసం ఆడియన్స్ ఆతృతగా ఎదురు చూస్తున్నారు. కానీ ప్రభాస్ మాత్రం 'కల్కి' జోలికి పోవడం లేదు. ప్రస్తుతం రాజాసాబ్, ఫౌజీ చేస్తున్నారు. త్వరలో 'స్పిరిట్' సెట్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నారు. మరి 'కల్కి' దర్శకుడు నాగ్‌అశ్విన్ ఏం చేస్తున్నారు? అంటే.. ఆయన కుటుంబంతో కలిసి ప్రస్తుతం విహార యాత్రల్లో ఉన్నారు. ఇటీవల కేరళలో కుటుంబ సమేతంగా దర్శనమిచ్చారు. ఆయన కనిపించగానే అభిమానులు చుట్టుముట్టి 'కల్కి' గురించి ప్రశ్నల వర్షం కురిపించారు. ఆయన 'వర్క్ స్టార్ట్ చేయాలి.. సెకండ్ పార్ట్ కోసం తీసిన ఫుటేజ్ కొంత రెడీగా ఉంది.. త్వరలో పని మొదలుపెడతా..' అన్నారు. ఏదేమైనా ఈ ఏడాది, వచ్చే ఏడాది రాజాసాబ్, ఫౌజీ, స్పిరిట్ సినిమాలకు సరిపోతాయి. సో.. ఇక 'కల్కి-2' 2027లోనే అని చాలామంది అభిప్రాయపడుతున్నారు.

నెవర్ బిఫోర్ అనిపించే క్లైమాక్స్

క్లైమాక్స్ బాగుంటే సినిమా హిట్. చాలా సినిమాల విషయంలో ఇది నిరూపణ అయ్యింది కూడా. ఉదాహరణకు 'రంగస్థలం'. సినిమా బాగుంటుంది.. క్లైమాక్స్ అయితే నెక్ట్స్ లెవల్. ఇక 'ఉప్పెన' సరేసరి. క్లైమాక్స్ కోసమే ఆడిందా సినిమా. అందుకే.. ప్రస్తుతం రామ్‌చరణ్‌తో చేస్తున్న 'పెద్ది'(వర్కింగ్ టైటిల్) సినిమాకు సంబంధించిన క్లైమాక్స్‌ని నెవర్ బిఫోర్ అనే రేంజ్‌లో రాసుకున్నాడట దర్శకుడు బుచ్చిబాబు సాన. ఆడియన్స్‌ని మళ్లీ మళ్లీ ఈ క్లైమాక్స్ థియేటర్లకు రప్పిస్తుందని ఇన్ సైడ్ టాక్. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయిక. రెహమాన్ సంగీత దర్శకుడు. 'రంగస్థలం'లో రామ్‌చరణ్‌కు సరిగ్గా వినపడదు. అలాగే పెద్దిలో కూడా రామ్‌చరణ్‌పాత్రకు ఓ లోపం ఉంటుందట. దానితో నడిపించిన డ్రామా నెక్ట్స్ లెవల్లో ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానున్న ఈ సినిమాకు సంగీతం: ఏఆర్ రెహమాన్.

ముక్కోణపు ప్రేమాయణం

సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'తెలుసు కదా'. నీరజ కోన దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు.శ్రీనిధిశెట్టి, రాశీఖన్నా కథానాయికలుగా నటిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. నేడు సిద్ధు జొన్నలగడ్డ జన్మదినం సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. 'ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది. సిద్ధు జొన్నలగడ్డ పాత్ర కొత్త పంథాలో ఉంటుంది. కథానుగుణంగా సంగీతానికి చాలా ప్రాధాన్యం ఉంటుంది' అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: జ్ఞానశేఖర్ బాబా, సంగీతం: తమన్, ప్రొడక్షన్ డిజైనర్: అవినాష్ కొల్లా, రచన-దర్శకత్వం: నీరజ కోన.

మజాకా నవ్వుల సందడి

'ధమాకా'తో వందకోట్ల సక్సెస్ అందుకున్న దర్శకుడు నక్కిన త్రినాథరావు ఈ నెల 26న 'మజాకా'తో రానున్నారు. సందీప్ కిషన్, రీతు వర్మ జంటగా రూపొందుతోన్న ఈ మాస్ ఎంటర్టైనర్‌కు రాజేష్ దండా, ఉమేష్ కేఆర్ బన్సాల్ నిర్మాతలు. ఈ సినిమా రిలీజ్ డేట్‌ని మేకర్స్ శుక్రవారం ఓ ప్రకటన ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో సందీప్‌కిషన్, రీతు వర్మ స్టైలిష్ అండ్ కలర్‌ఫుల్‌గా డ్యాన్స్ చేస్తూ కనిపిస్తున్నారు. మహాశివరాత్రి కానుకగా విడుదల కానున్న ఈ సినిమా ప్రేక్షకులకు అద్భుతమైన వినోదాన్ని పంచుతుందని, త్రినాథ రావు నక్కిన ఆద్యంతం హాస్యప్రధానంగా ఈ సినిమాను మలిచారని మేకర్స్ తెలిపారు. రావురమేష్, అన్నకీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: నిజార్ షఫీ, సంగీతం: లియోన్ జేమ్స్, సహనిర్మాత: బాలాజీ గుత్తా, నిర్మాణం: ఏకే ఎంటర్టైన్మెంట్స్, హాస్య మూవీస్.

మోగ్లీ వచ్చేస్తున్నాడు

రోషన్ కనకాల కథానాయకుడిగా రూపొందుతోన్న చిత్రం 'మోగ్లీ 2025'. 'కలర్‌ఫొటో'ఫేం సందీప్‌రాజ్ దర్శకత్వంలో పీపుల్‌మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి.విశ్వప్రసాద్, కృతిప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలోనే మొదలుకానుంది. టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్లు ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించాయి. విభిన్నమైన కథ, కథనాలతో ఈ సినిమా రూపొందనున్నదని దృకుడు సందీప్‌రాజ్ తెలిపారు. ఫారెస్ట్ నేపథ్యంలో సాగే ఈ కాంటెంపరరీ ప్రేమకథలో రోషన్ కొత్త కోణంలో కనిపిస్తారని ఆయన చెప్పారు. 'మోగ్లీ' తర్వాత రోషన్ మరో సినిమాకి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు. ఈ ఏడాది ప్రథమార్థంలో ఆ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. దానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సివుంది.

పర్వీన్ బాబీ బయోపిక్‌లో..

ప్రస్తుతం అన్ని భాషల్లో బయోపిక్‌ల ట్రెండ్ నడుస్తున్నది. ఒకనాడు అగ్ర తారలుగా వెలుగొందిన నటీనటుల జీవితాలను వెండితెరపైకి తీసుకొచ్చేందుకు దర్శకనిర్మాతలు ఆసక్తిని కనబరుస్తున్నారు. ఇప్పటికే బాలీవుడ్‌లో ఈ తరహా చిత్రాలెన్నో వచ్చాయి. తాజాగా బాలీవుడ్ మేటి నటి పర్వీన్ బాబీ జీవిత కథ వెబ్ సిరీస్ రూపంలో రానుంది. పర్వీన్ బాబీ పాత్రలో 'యానిమల్' ఫేమ్ త్రిప్తి డిమ్రి నటించనుంది. షోనాలీబోస్ దర్శకత్వం వహించబోతున్న ఈ సిరీస్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. 70-80దశకంలో హిందీ చిత్రసీమలో స్టార్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకుంది పర్వీన్ బాబీ. అద్భుతమైన అందం, అభినయంతో ఆనాటి యువతరాన్ని ఆకట్టుకుంది. అదే సమయంలో వ్యక్తిగత జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంది. ఈ నేపథ్యంలో పర్వీన్ బాబీ బయోపిక్ అందరిలో ఆసక్తినిరేకెత్తిస్తున్నది. ఈ సినిమా కోసం త్రిప్తి డిమ్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నదని, పర్వీన్‌బాబీ నటించిన సినిమాలను చూస్తూ ఆమె నటనా శైలి, హావభావాలను అర్థం చేసుకుంటున్నదని దర్శకుడు తెలిపారు.

దర్శకుడిగా శంకర్ తనయుడు

ప్రముఖ దర్శకుడు ఎన్.శంకర్ తనయుడు దినేష్ మహీంద్ర తండ్రి బాటలోనే మెగాఫోన్ పట్టబోతున్నారు. దర్శకుడిగా అరంగేట్రం చేస్తూ ఓ ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీని తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నారు. దినేష్ మహీంద్ర ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో దర్శకత్వ విభాగంలో శిక్షణ పొందారు. స్క్రీన్‌ప్లే అంశంలో పలు కోర్సులను పూర్తి చేశారు. ఈ చిత్రాన్ని ఆరెక్స్ క్రియేషన్స్ సంస్థ నిర్మించనుంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన పాటల రికార్డింగ్ జరుగుతున్నదని, ఏప్రిల్‌లో షూటింగ్‌ను ప్రారంభిస్తామని చిత్ర బృందం తెలిపింది. నూతన తారలు, సాంకేతిక నిపుణులతో ఈ చిత్రాన్ని రూపొందించబోతున్నామని, త్వరలో మరిన్ని వివరాలను వెల్లడిస్తామని మేకర్స్ పేర్కొన్నారు.

రీ యూనియన్లు జ్ఞాపకాల కోసం కాదు..

'డాన్ బోస్కో' పేరుతో ఓ కామెడీ నేపథ్య చిత్రం తెరకెక్కుతున్నది. పి.శంకర్‌గౌరి దర్శకత్వంలో రవీంద్ర బెనర్జీ (బెన్నీ), ముప్పనేని శైలేష్‌రామ నిర్మిస్తున్న ఈ సినిమా శుక్రవారం పూజా కార్యక్రమాలతో మొదలైంది. ముహూర్తపు సన్నివేశానికి సాహు గారపాటి కెమెరా స్విచాన్ చేయగా, చుక్కపల్లి సురేష్ క్లాప్ ఇచ్చారు. చిన్నబాబు స్క్రిప్ట్‌ను మేకర్స్‌కి అందించారు. ఈ సందర్భంగా టైటిల్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. 'వెల్‌కమ్ టు ది క్లాస్ రీయూనియన్-బ్యాచ్ 2014', 'అన్ని రీ యూనియన్లు జ్ఞాపకాల కోసం కాదు.. కొన్ని విముక్తికి సంబంధించినవి..' అంటూ పోస్టర్‌పై రాసిన క్యాప్షన్స్ సినిమాపై కథపై ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ప్రిన్సిపల్ విశ్వనాథ్‌గా మురళీశర్మ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారని, లెక్చరర్ సుమతిగా మిర్నా మీనన్ కనిపిస్తారని, మౌనిక, రాజ్‌కుమార్ కాసిరెడ్డి, విష్ణు ఓయ్ పాత్రలు ఆసక్తికరంగా ఉంటాయని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: ఎదురోలు రాజు, సంగీతం: మార్క్ కె.రాబిన్, నిర్మాణం: లౌక్య ఎంటర్టైన్మెంట్స్, శ్రీమాయ ఎంటర్టైన్మెంట్స్.

వచ్చే పదేండ్లలో విద్యుత్తు డిమాండ్ రెట్టింపు

- ప్రస్తుతం 15వేల మెగావాట్ల డిమాండ్
- 2035 కల్లా 31 వేలకు పెరిగే అవకాశం
- ఏటా 4నుంచి 6% చొప్పున పెరిగే చాన్స్
- వినియోగం 5% పెరుగుతున్నట్టు అంచనా
- సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ నివేదిక వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో విద్యుత్తు అవసరాలు మరింతగా పెరుగుతాయిని, వచ్చే పదేండ్లలో పీక్ విద్యుత్తు డిమాండ్ రెట్టింపు అవుతుందని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) వెల్లడించింది. ఈ మేరకు స్థాపిత విద్యుత్తు సామర్థ్యాన్ని పెంచాలని సూచించింది. ప్రస్తుతం పీక్ డిమాండ్ 15వేల మెగావాట్ల విద్యుత్తు డిమాండ్ ఉండగా, 2034-35 కల్లా అది 31,809 మెగావాట్లకు చేరుతుందని సీఈఏ అంచనా వేసింది. 2027-28లో 20 వేలు, 2030-31లో 25 వేలు, 2033-34లో 30 వేల మెగావాట్లు దాటుతుందని అంచనా వేసింది. ఈ మేరకు 'రిపోర్ట్ ఆన్ రిసోర్స్ అడిక్వసీ ప్లాన్ ఫర్ ది స్టేట్ తెలంగాణ' నివేదికను సీఈఏ ఇటీవలే విడుదల చేసింది. 2024-25లో విద్యుత్తు పీక్ డిమాండ్ 16,877 మెగావాట్లు దాటుతుందని సీఈఏ అంచనా వేసింది. ఇలా ఏటా 4 నుంచి 6% చొప్పున డిమాండ్ పెరుగుతుందని స్పష్టంచేసింది. విద్యుత్తు వినియోగం ఏటా 5% చొప్పున పెరుగుతున్నట్టు సంస్థ స్పష్టంచేసింది. విశేషమేంటంటే ప్రతి రెండేండ్లకు 5,000 మెగావాట్ల చొప్పున అధికం కానున్నది. రాబోయే పదేండ్లలో 2,938 మెగావాట్ల విద్యుత్తు పీపీఏ గడువు ముగియనున్నది. దీంతోడి మాండ్ పెరిగి, పీపీఏల గడువు ముగిస్తే విద్యుత్తు సమస్య తీవ్రమయ్యే అవకాశాలు ఉన్నాయి.

గడువు ముగియనున్న పీపీఏలు

- రాబోయే పదేండ్లలో 1,916 మెగావాట్ల థర్మల్, 807 గ్యాస్, 160 మెగావాట్ల న్యూక్లియర్, మరో 54 మెగావాట్ల ఇతర విద్యుత్తు పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ల (పీపీఏ) గడువు ముగియనున్నది.
- అత్యధికంగా 2029-30లో 1,299 మోగావాట్లు, 2028-29లో 545, 2024-25లో 358 మెగావాట్ల చొప్పున పీపీఏల గడువు ముగుస్తుంది.
- వచ్చే పదేండ్లలో 4,400 మెగావాట్ల పవన, 18,500 మెగావాట్ల సోలార్, 5,004 మెగావాట్ల డిస్ట్రిబ్యూటెడ్ రెన్యువబుల్ చొప్పున మొత్తంగా 27,904 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తిని పెంచాలి.
- యాదాద్రిలో రెండో యూనిట్ ప్రస్తుతం అందుబాటులోకి రాగా, మిగతా నాలుగు యూనిట్లు 2025-26లో అందుబాటులోకి రావాల్సి ఉన్నది.
- విద్యుత్తు వినియోగం 2026-27లో లక్ష మిలియన్ యూనిట్లు దాటనుండగా, 2034-35లో 1.5 లక్షల మిలియన్ యూనిట్లకు చేరుతుంది.

హర్షప్రదకు రజతం

ఆట

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్ వేదికగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక నేషనల్ గేమ్స్‌లో తెలంగాణ ఖాతాలో మరో పతకం చేరింది. తైక్వాండోలో రాష్ట్ర యువ ప్లేయర్ పాయం హర్షప్రద రజత పతకంతో మెరిసింది. మహిళల 73కిలోల కేటగిరీలో హర్షప్రద సత్తాచాటి రెండో స్థానంలో నిలిచింది. శుక్రవారం ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన ఫైనల్ పోరులో హర్షప్రద 0-2 తేడాతో చండీగఢ్‌కు చెందిన ప్రత్యర్థి చేతిలో ఓటమిపాలైంది. అంతకు ముందు జరిగిన సెమీస్‌లో ఉత్తరాఖండ్ ప్లేయర్‌పై గెలిచి ఫైనల్‌కు అర్హత సాధించింది. జాతీయ క్రీడల్లో పతకం సాధించిన హర్షప్రదను సాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి, తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు సతీశ్‌గౌడ్ ప్రత్యేకంగా అభినందించారు.

రంజీ నాకౌట్ సమరం

నేటి నుంచి క్వార్టర్స్ పోరు

కోల్‌కతా: దేశవాళీ టోర్నీ రంజీ ట్రోఫీలో కీలక పోరుకు రంగం సిద్ధమైంది. శనివారం నుంచి రంజీ నాకౌట్ సమరానికి తెరలేవనుంది. లీగ్ దశలో అదరగొట్టిన జట్లు కీలకమైన క్వార్టర్స్‌లో తాడోపేడో తేల్చుకోనున్నాయి. ముంబై-హర్యానా, విదర్భ-తమిళనాడు, జమ్ము కశ్మీర్-కేరళ, సౌరాష్ట్ర-గుజరాత్ వేర్వేరు వేదికల్లో తలపడనున్నాయి. డిఫెండింగ్ చాంపియన్ ముంబై, హర్యానాను చారిత్రక ఈడెన్‌గార్డెన్స్‌లో ఢీకొనబోతున్నది. తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో పసికూన మేఘాలయపై ఇన్నింగ్స్ విజయంతో ముంబై మంచి జోరుమీదుంది. వాస్తవంగా షెడ్యూల్ ప్రకారం లాహ్లి(హర్యానా)లో జరుగాల్సి ఉన్నా..ఎలాంటి సమాచారం లేకుండా కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్‌కు మార్చారు. దీంతో సొంతగడ్డపై సత్తాచాటుదామనుకున్న హర్యానా ఆశలపై నీళ్లు చల్లినట్లయ్యింది. మరోవైపు రికార్డు స్థాయిలో 43వ టైటిల్‌పై కన్నేసిన ముంబై..ప్రత్యర్థి ఎవరైనా కడదాకా పోరాడటంలో ఆరితేరింది. దీనికి తోడు సూర్యకుమార్‌యాదవ్, శివమ్ దూబే చేరికతో ముంబై మరింత పటిష్ఠంగా తయారైంది. వీరికి తోడు ఇప్పటికే మూడు సెంచరీలు కొట్టిన సిద్దేశ్ లాడ్, ఆకాశ్ ఆనంద్, శామ్స్ ములానీతో పాటు కెప్టెన్ రహానే మంచి ఫామ్‌లో ఉన్నారు. సూర్యకుమార్, దూబే రాకతో తుది జట్టు కూర్పుపై సందిగ్ధత ఏర్పడింది. ఒకవేళ వీరిద్దరిని తీసుకుంటే మార్పులు, చేర్పులు తప్పకపోవచ్చు. మరోవైపు హర్యానా.. ముంబైకి దీటైన పోటీనిచ్చేందుకు పావులు కదుపుతున్నది. కెప్టెన్ అంకిత్‌కుమార్, నిశాంత్ సింధు, హిమాన్షు రాణాతో కూడిన బ్యాటింగ్ బలంగా కనిపిస్తున్నది. అన్షుల్ కాంబోజ్, అనూజ్ థాక్రల్, జయంత్ యాదవ్ చెలరేగితో ముంబైకి కష్టాలు తప్పకపోవచ్చు.

దూబే అదుర్స్:

మిగతా క్వార్టర్స్ మ్యాచ్‌ల విషయానికొస్తే విదర్భ యువ స్పిన్నర్ హర్ష్ దూబే లీగ్‌లో 55 వికెట్లతో ప్రస్తుతం టాప్‌లో కొనసాగుతున్నాడు. గత నాలుగేండ్లుగా చెన్నైలో లీగ్ క్రికెట్ ఆడుతున్న దూబే తన స్పిన్ మాయాజాలంతో ప్రత్యర్థి బ్యాటర్లను ముప్పుతిప్పలు పెడుతున్నాడు. తన లెఫ్టార్మ్ స్పిన్‌తో ఆరుసార్లు ఐదు వికెట్ల ప్రదర్శనతో దూబే అదరగొట్టాడు. కేవలం బౌలింగ్ వరకు పరిమితం గాకుండా బ్యాటింగ్‌లోనూ మూడు అర్ధసెంచరీలతో 308 పరుగులతో కొనసాగుతున్నాడు. రవీంద్ర జడేజా, రంగనా హెరాత్‌ను ఆదర్శంగా తీసుకునే దూబే స్పిన్ ఆల్‌రౌండర్‌గా పేరు తెచ్చుకునేందుకు ముందుకుసాగుతున్నాడు. మిగతా క్వార్టర్స్‌లో జమ్ము కశ్మీర్ ప్లేయర్లు శుభమ్ ఖజురియా(663 పరుగులు), అభిజ్ నబి(38 వికెట్లు) మంచి ఫామ్‌మీదున్నారు. ఇలా రంజీ క్వార్టర్స్ రసవత్తరంగా సాగే అవకాశముంది.

పిల్లి మాదంటే మాదే..

రెండు కుటుంబాల వాదన

ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పిల్లి వెంట్రుకలు

నీలగిరి, ఫిబ్రవరి 7 : నల్లగొండ జిల్లాలో పిల్లి మిస్సింగ్ కేసు ఫోరెన్సిక్ ల్యాబ్ వరకూ వెళ్లింది. నల్లగొండ పట్టణంలోని రెహమత్‌నగర్‌కు చెందిన పుష్పలత నెల రోజుల వయసు గల పిల్లి పిల్లను పెంచుకుంటున్నది. దానికి పప్పి అని పేరు పెట్టుకొని మూడేండ్లు సాదింది. గతేడాది జూన్‌లో తన పిల్లి కనపడడం లేదని టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టింది. సీన్ కట్ చేస్తే.. రెండ్రోజుల కిందట ఓ పిల్లి ఆమె ఇంటికి వచ్చింది. అదే వీధిలో ఉండే అఫ్రాఫ్ తన పిల్లిని అపహరించి, గుర్తుపట్టకుండా రంగు వేశాడని పుష్పలత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ పిల్లి తమదేనని అఫ్రాఫ్ కుటుంబం చెప్తున్నది. ఓ వ్యక్తి దగ్గర రూ.3,500కి కొనుగోలు చేశామని పేర్కొంటున్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు పోలీసులు పిల్లి వెంట్రుకలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ల్యాబ్ రిపోర్ట్ వచ్చిన తరువాత పిల్లి ఎవరిదనేది తేల్చనున్నారు. ప్రస్తుతం పిల్లి అఫ్రాఫ్ వద్దే ఉంది.

పాలమూరుకు జాతీయ హోదా ఇవ్వలేం

- సాంకేతిక, ఆర్థిక మదింపు చేయకుండా అసాధ్యం
- కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్-2 పరిధిలో ప్రాజెక్టు
- పార్లమెంట్‌లో కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించడం ప్రస్తుతానికి సాధ్యం కాదని కేంద్రం తేల్చిచెప్పింది. ప్రాజెక్టు సాంకేతిక, ఆర్థిక మదింపు చేయకుండా జాతీయ హోదా ఇవ్వలేమని వెల్లడించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఎత్తిపోతల పథకాలకు జాతీయ హోదా కల్పించడంపై పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నకు కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి రాజ్‌భూషణ్ చౌదరి ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 'తెలంగాణ ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీముకు జాతీయ హోదా కోరింది. ఈ ప్రాజెక్టు సాంకేతిక-ఆర్థిక మదింపును కేంద్ర జల కమిషన్ (సీడబ్ల్యూసీ) నిర్వహించాలి. తరువాత ఈ ప్రాజెక్టు నీటి పునరుద్ధరణ, వరద నియంత్రణ, బహుళ ప్రయోజన ప్రాజెక్టులపై సలహా కమిటీ నుంచి ఆమోదం పొందాలి. ఈ ప్రాజెక్టు డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్)ను తెలంగాణ ప్రభుత్వం 2022 సెప్టెంబర్‌లోనే సీడబ్ల్యూసీకి సాంకేతిక-ఆర్థిక మదింపు కోసం సమర్పించింది. అయితే, ఈ ప్రాజెక్టు కృష్ణానది జలాలను ఉపయోగించడం, అంతర్రాష్ట్ర అంశాలను కలిగి ఉండటం వల్ల కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్-2 దర్యాప్తు పరిధిలో ఉన్నది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక-ఆర్థిక మదింపు నిర్వహించలేం. కాబట్టి జాతీయ హోదా కూడా ఇవ్వలేం' అని కేంద్ర మంత్రి స్పష్టంచేశారు.

మార్చి 1న బీసీసీఐ ఎస్‌జీఎమ్

న్యూఢిల్లీ: ముంబై ప్రధాన కార్యాలయం వేదికగా మార్చి 1వ తేదీన బీసీసీఐ ప్రత్యేక సర్వసభ్య సమావేశం(ఎస్‌జీఎమ్) జరుగనుంది. ఈ భేటీలో బోర్డు కొత్త సంయుక్త కార్యదర్శిని ఎన్నుకోనున్నారు. ఇప్పటి వరకు సంయుక్త కార్యదర్శిగా ఉన్న దేవజిత్ సైకియా ప్రస్తుతం కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో ఆ పదవి ఖాళీ అయింది. దీన్ని భర్తీ చేసేందుకు సింగిల్ పాయింట్ ఎజెండాతో ఎస్‌జీఎమ్ ఏర్పాటు చేస్తున్నట్లు అన్ని రాష్ట్రాల క్రికెట్ సంఘాలకు బీసీసీఐ నోటీసులు పంపింది. సంయుక్త కార్యదర్శి పదవి కోసం బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు అవిషేక్ దాల్మియా, ఢిల్లీ క్రికెట్ సంఘం(డీడీసీఏ) చీఫ్ రోహన్ జైట్లీ, ముంబై క్రికెట్ అసోసియేషన్(ఎమ్‌సీఏ) అధ్యక్షుడు సంజయ్ నాయక్ పోటీపడుతున్నారు.

క్రికెట్‌కు అజయ్‌రెడ్డి వీడ్కోలు

హైదరాబాద్: అంతర్జాతీయ క్రికెట్‌కు భారత అంధుల జట్టు మాజీ కెప్టెన్ అజయ్‌రెడ్డి వీడ్కోలు పలికాడు. తన సుదీర్ఘ కెరీర్‌కు ఫుల్‌స్టాప్ పెడుతున్నట్లు అజయ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొనాడు. తన 15 ఏండ్ల కెరీర్‌లో భారత్ తరపున 101 వన్డేలు, టీ20 మ్యాచ్‌లాడిన ఈ ఆంధ్రప్రదేశ్ క్రికెటర్ టీ20 ప్రపంచకప్(2012), వన్డే వరల్డ్‌కప్(2014), ఆసియాకప్(2016), టీ20 ప్రపంచకప్(2017), వన్డే వరల్డ్‌కప్(2018), టీ20 ప్రపంచకప్(2022)లో భారత విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. తనకు మద్దతుగా నిలిచిన అందరికీ ఈ సందర్భంగా అజయ్ కృతజ్ఞతలు తెలిపాడు.

ఆసీస్ 330-3

గాలె: శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో ఆస్ట్రేలియా అదరగొడుతున్నది. కెప్టెన్ స్టీవ్ స్మిత్(120 నాటౌట్), అలెక్స్ క్యారీ(139 నాటౌట్) సెంచరీలతో విజృంభించడంతో రెండో రోజు ఆట ముగిసే సరికి ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 330-3 స్కోరు చేసింది. ఖవాజ(36), హెడ్(21), లబుషేన్(4) నిరాశపరిచారు. మూడు కీలక వికెట్లు కోల్పోయిన తరుణంలో స్మిత్, క్యారీ నాలుగో వికెట్‌కు 239 పరుగుల అజేయ భాగస్వామ్యంతో ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. అంతకముందు ఓవర్‌నైట్ స్కోరు 229-9 శుక్రవారం తొలి ఇన్నింగ్స్‌కు దిగిన లంక 257 పరుగులకు ఆలౌటైంది. కుశాల్ మెండిస్(85నాటౌట్) ఆకట్టుకున్నాడు. స్టార్క్, కున్హెమన్, లియాన్ మూడేసి వికెట్లు పడగొట్టారు.

హెచ్‌పీజీఎల్ ఫైనల్లో కళింగ, కాంటినెంటల్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్(హెచ్‌పీజీఎల్) టోర్నీలో కళింగ వారియర్స్, కాంటినెంటల్స్ వారియర్స్ తుది పోరులో నిలిచాయి. వూటీ గోల్ఫ్ కోర్స్‌లో శుక్రవారం జరిగిన తొలి సెమీ ఫైనల్లో కళింగ టీమ్ 55-25 స్కోరుతో టీమ్ అల్వాపై ఘన విజయం సాధించింది. ఆదిత్య బొమ్మరాజు, ఇషాన్ అలీ, రణధీర్‌రెడ్డి, మణికాంత్‌రెడ్డి..కళింగ విజయంలో కీలకమయ్యారు. మరోవైపు రెండో సెమీస్‌లో కాంటినెంటల్ 20-30 స్కోరుత టైమ్ మైసాను ఓడించింది. కాంటినెంటల్ టీమ్‌లో రామ్ ముసునూరి, జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి అద్భుత ప్రదర్శన కనబరిచారు. వియాత్నంలో ఈనెల 23న జరిగే ఫైనల్లో కళింగ, కాంటినెంటల్ అమీతుమీ తేల్చుకోనున్నాయి.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.